కార్మికుల ఏరియర్స్ చెల్లించాలి

- వేతనాలు ఇవ్వాలంటూ వైస్ చైర్మన్ నేల మీద కూర్చొని నిరసన
- మద్దతు తెలిపిన కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు
- రసాభాసాగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాప్రతినిధులను సముదాయిస్తున్న చైర్‌పర్సన్ మంగమ్మ,మహమ్మద్‌ఖాజా

అమరచింత: మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు ప్రభుత్వం పెంచిన ఏరియర్స్‌ను వెంటనే ఇవ్వాలంటూ మున్సిపల్ వైస్ చైర్మన్ జీఎస్ గోపి కౌన్సిల్ సమావేశంలో నేల మీద కూర్చోవడంతో మిగితా కౌన్సిలర్లు మద్దతు తెలిపారు. కార్మికులకు తొమ్మిది నెలలుగా చెల్లించాల్సిన ఏరియల్స్‌ను ఇప్పటి వరకు ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించడంతో సమావేశం రసాభాసాగా మారింది. ఒక్కో కార్మికుడికి రూ.32,400 చెల్లించాలని, లేని పక్షంలో సమావేశం కొనసాగించలేమని నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని బుధవారం చైర్‌పర్సన్ మంగమ్మ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశం ప్రారంభం కాకముందే కార్మికుల ఏరియల్స్‌పై వైస్ చైర్మన్ పట్టుబట్టడంతో అధికార పార్టీ కౌన్సిలర్లు సైతం నేలపై బైటాయించారు. దీంతో చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ మహమ్మద్ ఖాజాను కౌన్సిలర్లు, వైస్ చైర్మన్ సమస్య పరిష్కరిస్తామని స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్‌లో జనరల్ బడ్జెట్ లేదని, సమస్యను కలెక్టర్‌కు విన్నవించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని చైర్‌పర్సన్ హామీ ఇచ్చిన వారు ఆందోళన విరమించలేదు. జనరల్ ఫండ్‌ను వేతనాల కోసం కాకుండా మున్సిపల్ సొంత అవసరాలకు వినియోగించడం ఏమిటని మూడవ వార్డు కౌన్సిలర్ విజయరాములు ప్రశ్నించారు. ఇప్పటి వరకు జనరల్ ఫండ్ ఎంత వచ్చిందనే విషయాలను కౌన్సిల్ సమా వేశంలో ప్రస్తావించక పోవడం ఏమిటన్నారు. పక్షం రోజుల వ్యవధిలో కార్మికుల ఏరియర్స్‌ను చెల్లిస్తామని చైర్‌పర్సన్, కమిషనర్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించి సమావేశంలో పాల్గొన్నారు.

సీసీ నిర్మాణాలపై పర్యవేక్షణ ఏది?

రూ.3.5 కోట్లతో పట్టణంలో నిర్మిస్తున్న సీసీ రహదారులపై అధికారుల పర్యవేక్షణ ఎక్కడుందని మూడో వార్డు కౌన్సిలర్ విజయరాములు కౌన్సిల్ సభలో ప్రస్తావించారు. క్యూరింగ్ లేదని, నాణ్యతకు విరుద్ధంగా రహదారుల నిర్మాణం జరుగుతున్నా పట్టించుకోవట్లేదని, కాంట్రాక్టర్‌తో అధికారులు కుమ్మక్కయ్యారని ఆరోపించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఐక్యంగా ఉంటూ మున్సిపల్ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. సమావేశంలో షాహిన్, షానవాజ్‌ఖాన్, కౌన్సిలర్లు రాజశేఖర్‌రెడ్డి, రాజ్‌కుమార్, సింధు, లక్ష్మి, మాధవి పాల్గొన్నారు.

బీజేపీ తీరు అప్రజాస్వామికం: కాంగ్రెస్



మాట్లాడుతున్న పర్వతాలుయాదవ్

గోపాల్‌పేట: రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయడం ద్వారా బీజేపీకి ప్రజాస్వామ్యం అంటే గౌరవం లేదనే విషయం అందరికీ తెలిసిపోయిందని రేవల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పర్వతాలు అన్నారు. బుధవారం ఆయన రేవల్లి మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్‌గాంధీ భారత్ జోడోయాత్ర చేపట్టడం, అదానీ, మోడీ చీకటి స్నేహంపై నిలదీయడంతో ఉక్కిరిబిక్కిరైన బీజేపీ రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేశారని విమర్శించారు. బీజేపీ కుట్రలను కాంగ్రెస్ పార్టీ న్యాయ పోరాటం ద్వారా ఎదుర్కొంటుందని అన్నారు. 2024లో రాహుల్‌గాంధీ ప్రధానమంత్రిగా లోక్‌సభలో అడుగు పెడతారని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వంకేశ్వరం, అంజనమ్మ, రాములు, బీసీ సెల్ అధ్యక్షుడు శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాన్ని పునరుద్ధరించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అమరచింత: మండల కేంద్రంలో ఆధార్ సెంటర్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ చాంద్‌పాషాకు కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందించారు. ఈమేరకు ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ మండల కేంద్రంతో పాటు మున్సిపల్ కేంద్రమైన అమరచింత పట్టణానికి మంజూరైన శాశ్వత ఆధార్ కేంద్రాన్ని రద్దు చేయడంతో మండల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. బయోమెట్రిక్, కొత్తగా ఆధార్ నమోదు చేసుకోనే వారు ఆధార్ సెంటర్ లేనందున సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితులు దాపరించాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజల అవసరాలను గుర్తించి ఆధార్ సెంటర్‌ను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో అజయ్, శ్యామ్ సుందర్, అరుణ్ కుమార్, దేవస్వామి,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

‘బీజేపీ బలోపేతానికి కృషి’



నియామక పత్రం అందిస్తున్న జిల్లా నాయకులు

పెబ్బేరు రూరల్: బూత్ కమిటీలు పటిష్టంగా ఉంటేనే రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని, అందుకోసం ప్రతి కార్యకర్త కృతనిశ్చయంతో పని చేయాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్ దిశా నిర్దేశం చేశారు. శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములలో బుధవారం మండల బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వశక్తి కరణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామంలో 241వ బూత్ కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్‌మోర్చా ప్రధాన కార్యదర్శి వెంకట్రామిరెడ్డి, మండల అధ్యక్షులు వెంకటస్వామి, రవి, చంద్రాయుడు, అశోక్‌యాదవ్, రాజు యాదవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత



బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న నాయకులు

మదనాపురం: మహనీయుల జయంతుల మాసం సందర్భంగా వారి ఆశయాల ప్రచారం కోసం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో బుధవారం మదనాపురం, కొత్తకోట మండలాల్లో పూలే, అంబేద్కర్ సందేశ్ బైక్ యాత్రను మండల ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు జగదీశ్ జెండా ఊపి ప్రారంభించారు. అదే విధంగా అంబేద్కర్ వాల్‌పోస్టర్‌ను ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్‌రాజేష్ మాదిగ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకట్రాములు, మ్యాతర్ల జగదీష్, వెంకటేష్, రంగన్న, చెన్నయ్య,దావీద్, మొగులన్న, మణివర్ధన్, మనోజ్ కుమార్, కోటేశ్వర్, మాసన్న,భీమేష్, హమాలీ సంఘం అధ్యక్షులు నాగరాజు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ పథకాన్ని పట్టణాల్లో అమలు చేయాలి



మాట్లాడుతున్న కాంతయ్య

గోపాల్‌పేట: ఉపాధి హామీ పథకం పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడుదామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య పిలుపునిచ్చారు. బుధవారం రేవల్లి మండలం కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ద్వితీయ సభలను నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, కార్యదర్శి అబ్రహాం, మండల కార్యదర్శి బాలరాజు, సీపీఐ మండల కార్యదర్శి యూసుఫ్, నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అమరచింత: పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు తొమ్మిది నెలలుగా చెల్లించాల్సిన ఏరియర్స్‌ను ఇప్పటి వరకు ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. కార్మికులకు ప్రతి నెల ఇవ్వాల్సిన ఏరియల్స్‌ను చైర్‌పర్సన్, కమిషనర్ కాజేశారని ఆరోపించారు. పట్టణంలో 2, 3, 7 వార్డుల్లో ఇప్పటికీ సీసీ రహదారుల నిర్మాణం ప్రారంభం కాలేదన్నారు. ఐదో వార్డులో సీసీ రహదారి కోసం కల్వర్టును తవ్వి వదిలేయడంతో ప్రజలు ఇబ్బందులకు గరవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ధర్నాకు సీపీఎం కౌన్సిలర్ విజయరాములు మద్దతు ఇచ్చారు. అనంతరం కమిషనర్ మహమ్మద్ ఖాజాకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో శ్యాం, ప్రకాశం, తౌఫిక్, అన్సు, హన్మంతునాయక్, లక్ష్మీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

రజకుల నిరసన

పట్టణంలో వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి స్థలాన్ని ఎందుకు చూపడం లేదంటూ రజక సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఆరు నెలలుగా స్థలాన్ని చూపాలని వినతిపత్రాలు అందిస్తున్నా చైర్‌పర్సన్, కమిషనర్ పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమ చూపకపోతే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో డ్రైవర్ శ్రీనివాసులు, టైలర్ శ్రీనివాసులు, నవరన్న పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం: కేసు నమోదు

గోపాల్‌పేట: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మల్లేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రానికి చెందిన ఖానాపురం సుజాత మంగళవారం రేషన్ సరుకులు తీసుకొస్తానని ఇంట్లో చెప్పి వెళ్లి సాయంత్రం వరకు ఇంటికి రాలేదు. తెలిసిన వారి ఇళ్లు, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం భర్త రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

ద్విచక్ర వాహనం చోరీ

గోపాల్‌పేట: మండల కేంద్రంలో ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. గోపాల్‌పేట ఎస్‌ఐ మల్లేష్ తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రంలోని రాంగనర్ కాలనీలో విశ్వనాథ్ రామాచారి కొన్ని రోజులుగా కుటుంబ సభ్యులతో కలిసి అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ఈనెల 9న ఎప్పటిలాగే ఇంటి ఎదుట ద్విచక్రవాహనం పెట్టి ఇంట్లో పడుకున్నారు. తెల్లవారి లేచి చూసే సరికి బైకు కనిపించలేదు. దీంతో బుధవారం విశ్వనాథ్ రామాచారి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలి

అమరచింత: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ప్రొహిబిషన్ కాలం పూర్తయినందున టీపీఎస్ఎఫ్ పిలుపు మేరకు నాలుగేళ్ల కాలాన్ని సర్వీస్‌గా పరిగణించాలంటూ నిరసన వ్యక్తం చేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి ఎంపీడీఓ జ్యోతికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సయ్యద్ రాజీక్, ఎంపీఓ నరసింహులు, ఏపీఓ బాలయ్య, శివరాణి, కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాసులు, సంధ్య పాల్గొన్నారు.

పాన్‌గల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని కోరుతూ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డికి, ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సమస్యను కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్లేలా కృషి చేస్తానని ఎంపీపీ హామీ ఇచ్చారు.

పెబ్బేరు: ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం జూనియర్ పంచాయతీ కార్యదర్శులు కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆవుల శైలజ, సర్పంచ్ జూదం వెంకటేష్, సూపరింటెండెంట్ విజయలక్ష్మి, ఏపీఓ పాల్గొన్నారు.

అభివృద్ధి సహకరించాలి

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని ప్రధాన రోడ్డు ఇరువైపులా డ్రెయినేజీ పనులకు దుకాణదారులు సహకరించాలని కమిషనర్ ఆదిశేషు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. పట్టణంలోని ప్రధాన రోడ్డుకు సెంటర్ లైటింగ్, డివైడర్ ఏర్పాటు చేశారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ పనులు జరుగుతుండడంతో దుకాణదారులు షాపుల ఎదుట చేస్తున్న పనులకు అంతరాయం కలిగించొద్దని సూచించారు. అలాగే మున్సిపాలిటీ సిబ్బందికి, కూలీలకు సహకరించాలని కోరారు. అనంతరం పనులకు అంతరాయం కలిగించడంతో పోలీసులు ఆధ్వర్యంలో పనులు కొనసాగాయి. కార్యక్రమంలో గణేష్‌బాబు, ఉమా మహేశ్వర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డ, టౌన్ ప్లానర్, మున్సిపల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పనుల పరిశీలన



కొత్తకోట రూరల్: జిల్లాలో తాగు నీటి సమస్య లేకుండా చూసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దమందడి మండలంలోని బుగ్గపల్లితండా సమీపంలో మిషన్ భగీరథ కింద నిర్మిస్తున్న ట్యాంక్‌లు, పంపుహౌజ్ పనులను బుధవారం తహసీల్దార్ సంధ్య పరిశీలించారు. సమీప రైతుల పొలాల నుంచి పైప్‌లైన్ వేస్తుండటంతో రైతులు తమకు నష్టపరిహారం అందించిన తర్వాతే పనులు మొదలెట్టాలని పనులను అడ్డుకున్నారు. దీంతో కాంట్రాక్టర్ పనులను నిలిపివేసి సంబంధిత అధికారులకు సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ సంధ్య రైతుల దగ్గరకు వెళ్లి పనులను అడ్డుకోవద్దని, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

విద్యార్థుల ప్రతిభ

కొత్తకోట రూరల్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 8, 9తరగతి విద్యార్థులకు ‘అంబేద్కర్ జీవితం నుంచి విద్యార్థులు గ్రహించవలసిన విషయం’పై వ్యాస రచన, ఉపన్యాస పోటీలు నిర్వహించినట్లు ఎంఈఓ జయశంకర్ తెలిపారు. ఉపన్యాస పోటీల్లో బలిజపల్లి విద్యార్థిని యశ్వంతి, వ్యాసరచన పోటీల్లో ఎస్టీ రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన శివనాయక్ ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ఎంఈఓ తెలిపారు. ఈ పోటీలను మద్దిగట్ల జెడ్పీహెచ్ హెచ్ఎం ఈశ్వరాచారి, తెలుగు ఉపాధ్యాయులు శ్యామ్ పర్యవేక్షించారు.

డ్రెయినేజీ మరమ్మతుకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



పైపు ఏర్పాటును పరిశీలిస్తున్న ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి

పాన్‌గల్: ‘అసంపూర్తి డ్రెయినేజీతో ఇబ్బందులు’ అనే శీర్షికన సాక్షి దినపత్రికలో సోమవారం వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రఘు అసంపూర్తి డ్రెయినేజీ ప్రాంతాన్ని సందర్శించి సమస్యను పరిష్కారించారు. మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల సమీపంలో అసంపూర్తి డ్రెయినేజీతో నిలిచిన మురుగు వెళ్లే విధంగా పైపు ఏర్పాటు చేయడంతో సమస్య పరిష్కారం అయింది. సమస్యను వెలుగులోకి తీసుకొచ్చి అధికారులు సమస్యను పరిష్కరించే విధంగా చేసిన సాక్షి దినపత్రికకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పాఠశాల సమీపంలోని కాలనీకి మంజూరైన సీసీ రోడ్ల నిధులను డ్రెయినేజీ నిర్మాణానికి వినియోగిస్తామన్నారు.

అవినీతి ఆరోపణలపై వాగ్వివాదం



ఇరువర్గాలను చెదరగొడుతున్న పోలీసులు

ఖిల్లాఘనపురం: మండలంలోని కమాలోద్దీన్‌పూర్‌లో సర్పంచ్ భర్త, జిల్లా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి అవినీతికి పాల్పడ్డారని, రుజువులతో నిరూపిస్తానని గ్రామానికి చెందిన యువకుడు శివ తెలిపారు. ఈ విషయమై బుధవారం గ్రామంలోని దేవాలయం వద్ద ప్రజలంతా సభ ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ సుమారు రెండేళ్ల క్రితం గ్రామంలోని నాగసముద్రం చెరువుతో పాటు మరో చెరువులో ఉన్న ఒండ్రు మట్టిని ఎక్కువ ధరకు విక్రయించి గ్రామస్తులకు మాత్రం సుమారు రూ.80 లక్షలకు విక్రయించినట్లు లక్ష్మారెడ్డి చెప్పారని ఆరోపించారు. అదేవిధంగా గ్రామ శివారులోని వాగు నుంచి ఇసుక తరలించిన విషయంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగినట్లు తన వద్ద అన్ని రుజువులు ఉన్నాయని శివ స్పష్టం చేశారు. ఈ విషయంలో గ్రామస్థులు రెండు వర్గాలుగా విడిపోయారు. ఒండ్రు మట్టి, ఇసుక విషయంలో ఎలాంటి అవినీతి జరగలేదని సభలో ఉన్న లక్ష్మారెడ్డి ప్రజలకు వివరించారు. ఇలా ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడంతో పాటుగా ఒకరిని ఒకరు తోసుకునే వరకు రావడంతో లక్ష్మారెడ్డి అక్కడి నుంచి వెళ్లిపోయారు. పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు.

గ్రామస్తుల సమక్షంలోనే తీర్మానం

గ్రామంలో ఒండ్రుమట్టి, ఇసుక విక్రయం విషయంలో ఎలాంటి అక్రమాలు జరగలేదు. ఏ విషయమైన గ్రామ సభలో ప్రజలందరి సమక్షంలోనే నిర్ణయాలు తీసుకున్నాం. కొన్ని నిధులు దేవాలయాల అభివృద్ధికి ఉపయోగించగా.. మిగతా డబ్బులు బ్యాంక్ ఖాతాలోనే ఉన్నాయి. ఈ నిధుల కోసం గ్రామంలో ప్రత్యేకంగా ఓ కమిటీని ఏర్పాటు చేశాం.

– లక్ష్మారెడ్డి, మాజీ చైర్మన్, జిల్లా మార్కెట్ కమిటీ

స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దుదాం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ గాయత్రి

అమరచింత: మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో పారిశుద్ధ్య పనులను గుర్తించి సంపూర్ణ పారిశుద్ధ్యం గల పట్టణంగా ఆత్మకూర్ మున్సిపాలిటీని మార్చుకుందామని చైర్‌పర్సన్ గాయత్రి అన్నారు. చైర్‌పర్సన్ గాయత్రి అధ్యక్షతన బుధవారం కలెక్టర్ ఆదేశాలతో ప్రత్యేక కౌన్సిల్ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ మురుగు కాల్వల శుభ్రత, నూతన డ్రెయినేజీల నిర్మాణాలు, సీసీ రహదారుల నిర్మాణాలతో పాటు తడి, పొడి చెత్త తరలింపులో ప్రత్యేక కార్యచరణతో ముందుకు వెళ్లాలని సిబ్బందికి సూచించారు. పట్టణంలోని ఆయా వార్డుల్లో కొత్తగా నిర్మిస్తున్న సీసీ రహదారుల నిర్మాణాలపై కాలనీ ప్రజలు దగ్గరుండి పనులను పర్యవేక్షించాలని, నాణ్యత లేకుంటే కౌన్సిలర్లకు సమాచారం అందించేలా కాలనీ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మున్సిపల్ ఆదాయ, వ్యయంపై చర్చించారు. సమావేశంలో వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ రమేష్ పాల్గొన్నారు.

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని 1వ వార్డు అంబేడ్కర్ నగర్‌లో పారిశుద్ధ్యం నిర్వహణపై బుధవారం చైర్ పర్సన్ కరుణశ్రీ, కమిషనర్ ఆదిశేషులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వార్డులో తిరుగుతూ మురికి కాల్వలు, రహదారులు శుభ్రం చేయడంతో పాటు పలు పారిశుద్ధ్యం కార్యక్రమాలపై ప్రజలకు, సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కర్రెస్వామి, కౌన్సిలర్లు పార్వతి, ఆశ్విని, ఏఈ రమేష్‌నాయుడు, మేనేజర్ గణేష్‌బాబు, జూనియర్ అసిస్టెంట్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి అతీతంగా ఉండాలి



వనపర్తిలో సబ్‌రిజిస్ట్రార్‌ను సన్మానిస్తున్న దస్తావేజు లేఖరులు



మదనాపురంలో..



అమరచింతలో..

వనపర్తి: జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని ముస్లిం ఉద్యోగులు, సిబ్బంది, దస్తావేజు లేఖరుల్లోని ముస్లింలకు సబ్ రిజిస్ట్రార్ క్రిస్టఫర్ ఇఫ్తార్ ఇచ్చారు. కార్యాలయం పక్కనే గల ఓ ప్రైవేట్ హాల్‌లో ఇఫ్తార్ ఏర్పాటు చేయడంతో పాటు దస్తావేజు లేఖరులకు ఖర్జూరాలను తినిపించారు. మత సామరస్యాలకు అతీతంగా కలిసి ఉండటంతో పాటు పండగలను చేసుకోవాలని సూచించారు.

మదనాపురం: మండల కేంద్రంలోని జామ మసీద్ ఆవరణలో కో ఆప్షన్ సభ్యుడు చాంద్‌పాష బుధవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. అంతకు ముందు మజీద్‌లో ముస్లింలు ప్రత్యే ప్రార్థనలు చేశారు.

అమరచింత: పట్టణంలో ఉపవాస దీక్షా చేస్తున్న ముస్లిం మహిళలకు తహసీల్దార్ చాంద్‌పాషా ఆధ్వర్యంలో బుధవారం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. పట్టణంలోని షాదీఖానాలో ఒకటో వార్డు నుంచి నాల్గోవార్డులోని ముస్లిం మహిళలకు ఇఫ్తార్‌ను ఏర్పాటు చేయ్యగా, మండల మహిళా సమాఖ్య భవనం అవరణంలో మూడో వార్డులోని ముస్లిం మహిళలకు ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. అదే విధంగా జామీయా మసీదులో రహీం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారని మజీద్ కమిటీ సభ్యులు తెలిపారు.

క్లుప్తంగా

కేఎల్ఐ కాల్వలో జమ్ము తొలగింపు



పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో కేఎల్ఐ కాల్వలో పేరుకుపోయిన జమ్ము తొలగింపు పనులు జోరుగా సాగుతున్నాయి. బుధవారం జమ్ము తొలగింపు పనులను సర్పంచ్ శాంతమ్మ, పంచాయతీ కార్యదర్శి నర్మద పరిశీలించారు. కాల్వలో పేరుకుపోయిన జమ్ముతో సాగునీరు ముందు సక్రమంగా పారక చివరి ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడేవారు. ఈ విషయాన్ని రైతులు సర్పంచ్ దృష్టికి తీసుకవెళ్లడంతో ఆమె అధికారులతో మాట్లాడి కాల్వలో జమ్ము, మట్టిని తొలగింపు పనులను ఉపాధి కూలీల ద్వారా చేయించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్థికసాయం అందజేత

పాన్‌గల్: మండలంలోని రాయినిపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన పంచాయతీ కార్మికుడు ఆనంద్ కుటుంబానికి మండల వీఆర్ఏల సంఘం ఆధ్వర్యంలో బుధవారం రూ.17 వేలు ఆర్థికసాయాన్ని డీటీ చక్రపాణి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మండల వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు సురేష్, వెంకటయ్య, వీఆర్ఏలు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో గుండెనొప్పి వచ్చినప్పుడు చేయాల్సిన సీపీఆర్ ప్రథమ చికిత్స, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజాప్రతినిధులకు, పంచాయతీ కార్యదర్శులకు, ఆశాకార్యకర్తలకు, ప్రజలకు డా.హరినాథ్‌రెడ్డి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండెపోటుతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని సీపీఆర్ ప్రథమ చికిత్సతో కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గాయత్రి, ఎంపీడీఓ ప్రసన్నకుమారి, తహసీల్దార్ అబ్రహంలింకన్, సర్పంచ్ వినీలారాణి, ఎంపీఓ రాజు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం




వనపర్తి క్రైం: రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమని సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అన్నారు. అంబేడ్కర్ 132వ జయంతిని పురస్కరించుకొని సాహితీ కళావేదిక సభ్యులు శ్రీనివాసులు జిల్లా కేంద్రంలోని రక్తనిధి కేంద్రంలో రక్తదానం చేశారు. కార్యక్రమంలో జనజ్వాల, బైరోజు చంద్రశేఖర్, నిరంజనయ్య, శ్రీకర్, వైద్య సిబ్బంది లక్ష్మీపతి, సంతోష్ తదితరులు ఉన్నారు.

శానిటేషన్ కిట్ల పంపిణీ

పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లితండా పంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు సర్పంచ్ శాంతమ్మ ఆధ్వర్యంలో బుధవారం శానిటేషన్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్, గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్ మాట్లాడారు. పంచాయతీ కార్మికులకు అవసరమయ్యే సబ్బులు, కొబ్బరినూనె, మంచినూనె ప్యాకెటు, శానిటైజర్, చేతుల గ్లౌజ్‌లు అందజేసినట్లు వారు పేర్కొన్నారు. కార్మికులకు రూ.24 వేల వేతనం చెల్లించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నర్మద, తండా వాసులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు కృష్ణయ్య, బొల్లమోని మూర్తి, బీసన్నతో పాటు 20 మంది సర్పంచ్ వినీలారాణి ఆధ్వర్యంలో బుధవారం వనపర్తి క్యాంప్ ఆఫీస్‌లో మంత్రి నిరంజన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వెంకటస్వామి, మహేష్‌గౌడ్, ఆంజనేయులు, కురుమన్న పాల్గొన్నారు.

లారీ, కారు ఢీ

పెబ్బేరు: పట్టణ కేంద్రం సమీపంలోని 44వ జాతీయ రహదారిపై లారీ, కారును ఢీకొనడంతో ఒకరికి స్వల్ప గాయాలైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాలలో.. జాతీయ రహదారిపై ఆనంద్ భవన్ ఉడిపి హోటల్ సమీపంలో మహబుబ్‌నగర్ నుంచి తిరుపతికి వెళ్తుతున్న కారును వెనక నుంచి వేగంగా వస్తున్న లారీ ఢీకొట్టడం కారు బోల్తా పడింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ప్రియాంకకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులకు సమాచారం రావడంతో సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. శ్రీకాంత్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జగదీశ్వర్ తెలిపారు.